సాక్షి మంచిర్యాల

బుధవారం । 6 । నవంబర్ । 2024

గిరిజన క్రీడోత్సవం

ఉట్నూర్‌లోని కేబీ ప్రాంగణంలో ఐదో రాష్ట్రస్థాయి గిరిజన క్రీడోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని ఐటీడీఏల పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాలల క్రీడాకారులు హాజరయ్యారు.

- వివరాలు 8లో



గరిష్టం/కనిష్టం 33.1 /19.1

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చాలా వరకు ఎండగా ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. చలి పెరుగుతుంది. ఉదయం మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఆర్కే న్యూటెక్ గనిని సందర్శించిన స్టార్ రేటింగ్ కమిటీ



గనిపై స్టార్ రేటింగ్ కమిటీ సభ్యులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే న్యూటెక్ గనిని కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఫైవ్‌స్టార్ రేటింగ్ కమిటీ సభ్యులు మంగళవారం సందర్శించారు. కమిటీ సభ్యుడు డీవీ.సుబ్రమణ్యం(ఓఎస్‌డీ–సీసీవో)తోపాటు అవినాశ్ శుక్లా, అజయ్‌కుమార్‌తో కూడిన కమిటీ గనిని సందర్శించింది. వీరికి ఏరియా ఎస్‌ఓటూజీఎం సత్యనారాయణ, ఏజెంట్ రాముడు, మేనేజర్ స్వామిరాజు స్వాగతం పలికారు. గనిలోకి దిగి పని స్థలాలను పరిశీలించారు. రక్షణ ఏర్పాట్లు, బొగ్గు ఉత్పత్తి, వృత్తి నైపుణ్యం తదితర అంశాలను పరిశీలించారు. బొగ్గు ఉత్పత్తి, ఉద్యోగుల రక్షణకు తీసుకుంటున్న చర్యలను అధికారులు వారికి వివరించారు. అనంతరం గని ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బెల్లంపల్లి సేఫ్టీ జీఎం రఘుకుమార్, గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి ఎస్కే.బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, రక్షణాధికారి రమేశ్, ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ ఆకుల రమేశ్, సంక్షేమ అధికారి పాల్‌సృజన్‌పాల్గొన్నారు.

ట్రస్మా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విష్ణువర్ధన్‌రావు

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ ప్రైవేట్ పాఠశాలల సంఘం(ట్రస్మా) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మంచిర్యాలకు చెందిన రాపోలు విష్ణువర్ధన్‌రావు ఎన్నికయ్యారు. ఈనెల 4న హైదరాబాద్‌లో జరిగిన ట్రస్మా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంచిర్యాలకు చెందిన కస్తూరి పద్మచరణ్‌ను రాష్ట్ర అడ్వయిజర్‌గా, బాలాజీని రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా, శరత్‌కుమార్‌ను రాష్ట్ర వైస్‌ప్రెసిడెంట్‌గా, అఖిలేందర్, రాంవేణును ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎన్నుకున్నారు.


కలెక్టర్‌ను కలిసిన జీఎం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ నూతన జీఎంగా బాధ్యతలు చేపట్టిన ఎల్వీ.సూర్యనారాయణ కలెక్టర్ కుమార్‌దీపక్‌ను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ఆర్టీసీ కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని టీజీఎస్‌ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడానికి గెజిట్ విడుదల అయినందున అపాయింటెడ్ తేదీ ప్రకటించి జీవో విడుదల చేయాలని కోరారు. వేతన సవరణ ఎరియర్స్ ఇస్తూ అలవెన్స్‌ను పెంచి ఇవ్వడం, ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించడం, ప్రైవేట్ బస్సులు రద్దు చేసి ప్రభుత్వమే కొత్త బస్సులు వేయాలని, మహాలక్ష్మి పథకానికి ప్రతీనెల రూ.350 కోట్లు విడుదల చేయాలని కోరారు. మహిళలకు జీరో టికెట్ బదులు, ఉచిత బస్సుకార్డు ఇవ్వాలని పేర్కొన్నారు. బ్రెడ్ విన్నర్ స్కీమ్‌లో ఇచ్చే ఉద్యోగాలు రెగ్యూలర్ ప్రాతిపదికన ఇవ్వాలన్నారు. జీవో 30 ప్రకారం ఆర్టీసీ ఉద్యోగులకు కూడా వయో పరిమితిని 44 ఏళ్లకు పెంచాలని కోరారు. డ్రైవర్లు, కండక్టర్లు, మెయింటనెన్స్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. జేఏసీ చైర్మన్ గోలి శంకర్, నాయకులు పాల్గొన్నారు.

పునరావాసంపై అవగాహన



మాట్లాడుతున్న రేంజ్ అధికారి సుష్మారావు

జన్నారం: కవ్వాల్ రిజర్వు ఫారెస్ట్ పరిధిలోని మల్యాల గ్రామం తరలింపు, పునరావాస ప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో భాగంగా పునరావాసంపై జన్నారం తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి, తాళ్లపేట్ ఫారెస్ట్ రేంజ్ అధికారి సుష్మారావు మంగళవారం అవగాహన కల్పించారు. గ్రామంలో ఇళ్లను లెక్కించే విధానం, పునరావాసానికి ప్రభుత్వం అందించే ప్రోత్సాహం, భూమి, జంతువుల అంశాలపై ఈనెల 6 నుంచి సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ఏమైనా సందేహాలు ఉంటే నేరుగా అటవీ అధికారిని సంప్రదించాలని సూచించారు.



తాండూర్ మండలం పెగడపల్లిలో దిగుబడి వచ్చిన పత్తిని తూకం వేస్తున్న రైతు

దూది రైతుకు దుఃఖిమే!

- ఒక్కసారి ఏరగానే ఖాళీ అవుతున్న పత్తి చేలు
- కీలక దశలో వర్షాలు లేక తగ్గిన దిగుబడి
- ఎకరాకు 3 నుంచి 5 క్వింటాళ్లే..
- పెట్టుబడి కూడా రాదంటున్న రైతులు

ఈ ఏడాది పత్తి సాగు 1.54 లక్షల ఎకరాలు	దిగుబడి అంచనా 13.20 లక్షల క్వింటాళ్లు
ఎకరాన రావాల్సిన దిగుబడి 10 నుంచి 12 క్వింటాళ్లు	ప్రస్తుతం వస్తున్న దిగుబడి 3 నుంచి 5 క్వింటాళ్లు
ఎకరానికి పెట్టిన పెట్టుబడి రూ. 38 వేల నుంచి 45 వేలు	దిగుబడి అమ్మితే వచ్చే డబ్బులు రూ. 30 వేల నుంచి 35 వేలు

మంచిర్యాలఅగ్రికల్చర్: దూది రైతుకు ఈసారీ దుఃఖమే మిగిలేలా ఉంది. తెల్లబంగారంగా చెప్పుకునే పత్తి పంట ఈ ఏడాది రైతులకు నిరాశే మిగిల్చింది. మద్దతు ధర గతేడాదితో పోలిస్తే రూ.వెయ్యి పెరిగిందని రైతులు సంతోషపడ్డారు. కానీ, ప్రస్తుతం చేతికి వస్తున్న దిగుబడి చూసి రైతులు దిగాలు చెందుతున్నారు. పంట ఎదిగే సమయంలో కురిసిన భారీ వర్షాలు పత్తి రైతును మురిపించాయి. పూత, కాత దశలో చినుకు రాలకపోవడంతో దిగుబడిపై ప్రభావం చూపింది. ఎదిగిన ఒక పత్తి చెట్టు 70 నుంచి 120 కాయల వరకు రావాల్సి ఉండగా.. 20 నుంచి 30 కాయలకు మించి కాయలేదు. దీంతో ఎకరానికి 10 క్వింటాళ్ల నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి రావాల్సిన పత్తి ప్రస్తుతం 3 నుంచి 5 క్వింటాళ్లకు మించి రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరం పత్తి సాగు ఈ ఏడాది రూ. 40 వేల వరకు పెట్టుబడి పెట్టినట్లు పేర్కొంటున్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున కౌలుకు భూములు తీసుకొని పత్తి సాగుచేశారు. ఎకరానికి రూ.15 వేల నుంచి రూ. 20 వేల చొప్పున కౌలుకు తీసుకుని పంట వేసుకున్నారు. ముందే కౌలు డబ్బులు చెల్లించి పంట సాగు చేశారు. ప్రస్తుతం దిగుబడి చూసి తమకు అప్పులే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన పెట్టుబడి..
గత ఏడాది కంటే ఈ ఏడాది మద్దతు ధర రూ.వెయ్యి పెరిగింది. దీంతో ఈసారి పత్తి రైతులు ఉత్సాహంగా పంట సాగుచేశారు. ఆరంభంలో వర్షాలు అనుకూలించాయి. పంట ఎదిగే సమయంలోనూ మంచి వర్షాలే కురిశాయి. తర్వాత పూత, కాత దశలో చినుకు లేకుండా పోయింది. తడి అందక దిగుబడి తగ్గిపోయింది. గతేడాదితో పోలిస్తే ఈసారి పత్తి సాగుకు పెట్టుబడి పెరిగినా.. దిగుబడి మాత్రం లేదు. గతంలో ఎకరాకు రూ.30 వేల నుంచి రూ. 35 వేల వరకు పెట్టుబడి పెట్టగా, ఈసారి రూ.40 వేల నుంచి రూ.45 వేలకు పెరిగింది. ప్రస్తుతం జిల్లాలో పత్తి ఏరుతుండగా మరికొన్ని ప్రాంతాల్లో ఇంకా కాత దశలో ఉంది. గత నెలలో ఒక వర్షం కురిస్తే ఆశించిన దిగుబడి వచ్చేదని రైతులు పేర్కొంటున్నారు.

ఎన్ని ఎరువులు వేసినా..
ఈ ఏడాది 1.54 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. 13.20 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల పత్తి దిగుబడి రావాల్సి ఉండగా 4 నుంచి 6 క్వింటాళ్లకు రావడం లేదని రైతులు పేర్కొంటున్నారు. ఒక్కసారి ఏరగానే చేను మొత్తం ఖాళీ అవుతుందని పేర్కొంటున్నారు. కాత బాగా రావడానికి రెండు, మూడుసార్లు ఎరువులు వేసినా ఫలితం లేకుండా పోయిందని పేర్కొంటున్నారు. ఏటా రెండు, మూడుసార్లు ఏరే పత్తి ఒక్కసారి ఏరగానే చేలు బోసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒక్కసారి ఏరడంతోనే సరి..

నాలుగు ఎకరాల్లో పత్తి సాగుచేసిన దసరా పండుగ తర్వాత నుంచి పత్తి ఏరుతున్న. ఎకరానికి నాలుగైదు క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. ఎదిగే దశలో భారీ వర్షాలు పడ్డయ్. కాత సమయంలో వర్షాలు లేవు. మూడుసార్లు ఎరువులు వేసిన ఏం లాభం లేదు. రెండు సార్లు ఏరే పత్తి ఒకసారితోనే పంట అయిపోయింది.

– కందుగుల నర్సయ్య, పెగడపల్లి, తాండూర్

కాత లేదు.. దిగుబడి లేదు

నాకున్న ఎనిమిది ఎకరాలతోపాటు మరో 25 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగుచేసిన ఎకరానికి 10 క్వింటాళ్ల పత్తి రావాల్సి ఉండగా 3 నుంచి 4 క్వింటాళ్లకు మించి రావడం లేదు. ఎకరం పత్తి సాగుకు రూ.40 వేల వరకు ఖర్చు వచ్చింది. దిగుబడి వస్తున్న పత్తికి రూ.20 వేలు కూడా వచ్చేలా లేదు. ఈ ఏడాది పత్తి పంట తీరని నష్టాన్ని మిగిల్చింది. కౌలుకు పట్టి సాగు చేసిన భూమితో అప్పు మీద పడుతంది.

– జపాతి నారాయణ, నెన్నెల

సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు

- జిల్లాలో ఏడు కేంద్రాలు ఏర్పాటు
- త్వరలో సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలు

తేమశాతాన్ని బట్టి మద్దతు ధర (క్వింటాల్‌కు)

తేమ శాతం	ధర క్వింటాల్‌కు(రూ.లలో)
8	7,521
9	7,445.79
10	7,370.58
11	7,295.37
12	7,220.16



దండేపల్లి మండలం గూడెంలో ఓరైతు ఇంట్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న పత్తి

దండేపల్లి: మంచిర్యాల జిల్లాలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ద్వారా పత్తి కొనుగోళ్లకు అధికారులు ఏర్పాట్లు చేశారు. రెండు, మూడు రో జుల్లో కొనుగోళ్లు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏడు జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలకు అనుమతిచ్చారు. మద్ద తు ధరకు రైతుల నుంచి కొనుగోలు చేయనున్నా రు. సీసీఐ కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో, కొన్నిచోట్ల కొంత మంది రైతులు తమ అవసరాల నిమిత్తం ప్రైవేటు వ్యాపారులకు పత్తిని విక్రయిస్తున్నారు. ప్రైవేటు వ్యాపారులు క్వింటాల్‌కు రూ.6వే ల నుంచి, రూ.6,200 వరకు మాత్రమే చెల్లిస్తున్నారు. కొంత మంది రైతులు మాత్రం సీసీఐ కొనుగోళ్లు ప్రారంభించే వరకు పత్తిని ఇళ్లలోనే నిల్వ ఉంచుతున్నారు. సీసీఐ కొనుగోళ్లు ప్రారంభం అయితే రైతులకు కొంత ప్రయోజనం చేకూరనుంది.

ఏడు చోట్ల కొనుగోలు కేంద్రాలు..
జిల్లాలో ఖరీఫ్‌లో 1,57,630 ఎకరాల్లో రైతులు పత్తిసాగు చేశారు. రైతులు పండించిన పత్తిని సీసీఐ ద్వారా కొనుగోలు చేసేందుకు జిల్లాలో ఏడు జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలకు అనుమతి లభించింది. దండేపల్లి మండలం కన్నెపల్లి శ్రీవెంకటేశ్వర జిన్నింగ్ మిల్లు, బెల్లంపల్లిలోని రేపల్లెవాడ శ్రీరామ జిన్నింగ్, మహేశ్వరి కాటన్, చెన్నూర్ మండలంలో చెన్నూర్ పట్టణంలోని చెన్నూర్ కాటన్, ఆదివార్‌పేటలోని జీఆర్ఆర్ కాటన్‌మిల్, ఎల్లక్కపేటలోని ఆదిశంకరాచార్య ఇండ్రస్ట్రీస్, కోటపల్లి మండలంలోని నవదుర్గ కాటన్ మిల్‌లో పత్తికొనుగోళ్లు చేపట్టనున్నారు. పత్తిలో తేమ శాతాన్ని బట్టి మద్దతు ధర చెల్లించనున్నారు.

తేమ లేకుండా ఆరబెట్టాలి..

సీసీఐలో పత్తి విక్రయించే రైతులు తేమ లేకుండా ఆరబెట్టి తీసుకువస్తేనే మద్దతు ధర వస్తుంది. తేమ శాతాన్ని బట్టి మద్దతు ధర చెల్లించడం జరుగుతుంది. తేమ శాతం 12 కంటే ఎక్కువ ఉంటే సీసీఐలో కొనుగోళ్లు చేయరు. రైతులే నేరుగా తీసుకురావాలి, లేదంటే రక్తసంబంధీకులు తీసుకురావా లి. ఆధార్, పట్టాపాస్‌బుక్, బ్యాంకుఖాతా బుక్ వెంట తీసుకురావాలి.

– షహబొద్దీన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, మంచిర్యాల

సమగ్ర ఇంటింటి సర్వే పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ కుమార్ దీపక్



అధికారులకు సూచనలు చేస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను అధికారులు, సిబ్బంది పకడ్బందీగా చేపట్టి సకాలంలో పూర్తిచేయాలని కలెక్టర్ కుమార్‌దీపక్ సూచించారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలో మంగళవారం ఆయన పర్యటించారు. 22, 23వ వార్డుల్లో ఇళ్లకు అంటించిన స్టిక్కర్లను పరిశీలించారు. బుధవారం నుంచి చేపట్టనున్న కుటుంబ సర్వే ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఎన్యూమరేటర్లు తమకు కేటాయించిన ఇళ్లను సందర్శించి కుటుంబ సభ్యుల వివరాలు నిర్ణీత నమూనాలో నమోదు చేయాలని సూచించారు. ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, ప్రత్యేక అధికారులు సమన్వయంతో పనిచేసి సర్వేను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే ఉన్నతాధికారులను సంప్రదించాలని తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డీవో పి.హరికృష్ణ , మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఉన్నారు.

సంతకం పెడతా.. మరి నాకేంటి?

- మహిళా కార్యదర్శులకు ఎంపీడీవో వేధింపులు
- వివాదాస్పదంగా అధికారి తీరు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: 'ఫైళ్లపై సంతకం పెడతా.. మరి నాకేంటి? మీ ఇంటికి ఎప్పుడు పిలుస్తావు? మా ఇంటికి ఎప్పుడు వస్తావు?' అంటూ జిల్లాలోని ఓ ఎంపీడీవో మహిళా కార్యదర్శులను వేధిస్తున్న తీరు వివాదాస్పదమవుతోంది. ఆ మండల అధికారి ప్రవర్తనతో మహిళా కార్యదర్శులు ఇబ్బంది పడుతున్నారు. పైఅధికారిగా ఉండడంతో ఆయన వద్దకు వెళ్తే వంకర మాటలు మాట్లాడుతూ ఇబ్బంది పెడుతుండడంతో ఎవరికీ చెప్పుకోలేక కుమిలిపోతున్నారు. జిల్లాలో సింగరేణి పరిధి విస్తరించిన ఓ మండల ఎంపీడీవో చేష్టలు రోజురోజుకూ శృతి మించుతున్నాయి. ప్రభుత్వ కార్యక్రమాలు పర్యవేక్షించే క్రమంలో డబుల్ మీనింగ్ మాట లు మాట్లాడడమే కాకుండా మానసికంగా ఇబ్బంది పెడుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఓ మహిళా కార్యదర్శితో ఆమె బంధువుల ఎదుటే అనుచితంగా ప్రవర్తించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శాఖా పరంగానూ మహిళా ఉద్యోగులకే షోకాజ్ నోటీసులు ఇస్తూ బెదిరిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు చేపట్టిన పలు అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపులోనూ జాప్యం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ మండలం నుంచి మరో చోటుకు ఓ ఏఈ బదిలీ పై వెళ్లేందుకు రిలీవ్ ఆర్డర్ ఇచ్చేందుకు కూడా డబ్బులు అడిగినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. ఆయన వ్యవహార శైలిపై ఇప్పటికే పంచాయతీరాజ్ ఉద్యోగుల ఫోరం ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. నేడో, రేపో ఆ ఎంపీడీవో నిర్వాకంపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు బాధితులు సిద్ధమవుతున్నారు.

ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరించాలి

- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య, పక్కన కలెక్టర్లు కుమార్ దీపక్, వెంకటేశ్ దోత్రే

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో వరి ధాన్యం సేకరణ ప్రక్రియ ఇబ్బందులు లేకుండా సమర్థవంతంగా చేపట్టాలని మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య సూచించారు. మంచిర్యాల సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు కుమార్ దీపక్, వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్లు మోతిలాల్, దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావులో కలిసి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే క్రమంలో తేమ, తప్ప, తాలు లేకుండా తెచ్చేలా వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలన్నారు. టార్పాలిన్లు, గన్నీ సంచుల కొరత లేకుండా చూడాలని తెలిపారు. ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి రైస్ మిల్లులకు ధాన్యం తరలించే సమయంలో రవాణా ఎగుమతి దిగుమతిలో హమాలీల నిర్వహణ ఇతర అంశాలపై పర్యవేక్షించాలని తెలిపారు. రైస్‌మిల్లుల్లో రిజిస్టర్లను స్పష్టంగా నిర్వహించాలని తెలిపారు. రైస్ మిల్లర్లతో ఒప్పందాల ప్రక్రియ పకడ్బందీగా ఉండాలన్నారు. సన్నరకం వడ్లకు ప్రభుత్వం రూ. 500 బోనస్ అందిస్తుందని, సన్నరకం, దొడ్డురకం వడ్ల సేకరణకు వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. రైస్ మిల్లుల్లో ధాన్యం అధికంగా ఉన్న సమయంలో గోదాంలలో నిల్వ చేసేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడల్లో సత్తా



విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

బెల్లంపల్లిరూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడల్లో బెల్లంపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల కాసిపేట విద్యార్థులు సత్తా చాటారు. ఇటీవల నిర్వహించిన పోటీల్లో 21 పతకాలు సాధించారు. ఈ నెల 2న చెన్నూర్‌లో జరిగిన అండర్ 14 ,17 అథ్లెటిక్స్ బాలుర ఎంపిక పోటీల్లో పాఠశాల విద్యార్థులు 7 బంగారు, 6 సిల్వర్ ,4 కాంస్య పతకాలు సాధించారు. 8 మంది విద్యార్థులు జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ 19 అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలు లక్సెట్టిపేటలో నిర్వహించగా షార్ట్‌పుట్ అండర్ –19 విభాగంలో సీఈసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఆదర్శ్ బంగారు పతకం, సీఈసీ మొదటి సంవత్సరం విద్యార్థి నిఖిల్ సిల్వర్ మెడల్ సాధించాడు. 200 మీటర్స్ అండర్ –19 పరుగు పందెంలో సీఈసీ మొదటి సంవత్సరం విద్యార్థి కె.శేఖర్ స్విలర్ మెడల్, 400 మీటర్స్ పరుగు పందెంలో సీఈసీ మొదటి సంవత్సరం విద్యార్థి తేజస్ కాంస్య పతకం గెలుచుకున్నారు. వీరిని మంగళవారం పాఠశాలలో అభినందించారు.

డీఏ, పీఆర్సీ చెల్లించాలి

- తపస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేశ్



తపస్ ఆధ్వర్యంలో ఐబీచౌరస్తాలో దీక్ష చేస్తున్న ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయుల నాలుగు డీఏలు, పీఆర్సీతోపాటు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేశ్ డిమాండ్ చేశారు. తపస్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఐబీ చౌరస్తాలో ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉంటే ఒకటి మాత్రమే ప్రకటించటం, సమయానికి ఇవ్వాల్సిన డీఏలను కూడా పండుగల పేరుతో ఇస్తూ ఉపాధ్యాయులు, ఉద్యోగులను ప్రభుత్వం అపహాస్యం చేస్తోందని అన్నారు. ఉపాధ్యాయులు తమ అవసరాల కోసం జీపీఎఫ్, టీఎస్‌జీఎల్‌ఐ రుణాలకు 2 ఏళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్న నేటికీ రాలేదని, సరెండర్ లీవ్ బిల్లులు మెడికల్ బిల్లులు కూడా విడుదల చేయలేదని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా టీచర్ల సమస్యలు పరిష్కారించాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. దీక్షకు బీజేవైఎం నాయకుడు అశ్విన్‌రెడ్డి సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయింపు శ్రీనివాసరావు, బగ్గని రవికుమార్, రాష్ట్ర అకడమిక్ కో–కన్వీనర విద్యాసాగర్, జిల్లా నాయకులు చీర సమ్మయ్య, నీలేశ్, భారతీ అశోక్, నాగరాజు, సాంబయ్య, వేణుగోపాల్‌రావు, తిరుపతి, శ్రీనివాస్, రుపాచారి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలతో రైతులకు భరోసా



జన్నారం : మొర్రిగూడ కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య

- డీఆర్డీవో కిషన్

దండేపల్లి: వరి కోతలు ఇప్పుడిప్పుడే మొదలవుతున్న తరుణంలో, ముందస్తుగానే వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రైతులకు భరోసా కల్పిస్తున్నామని డీఆర్డీవో కిషన్ తెలిపారు. దండేపల్లి మండల కేంద్రంతోపాటు, మండలంలోని నాగసముద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి నష్టపోకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోన్నే విక్రయించాలని సూచించారు. గ్రేడ్‌ఏ రకానికి రూ.2,320, సాధారణ రకానికి 2,300, సన్న రకానికి ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్ అందించడం జరుగుతుందని వివరించారు. ధాన్యం విక్రయించే రైతులు సెంటర్ నిర్వాహకులకు పట్టాపాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ బుక్ అందించాలన్నారు. కార్యక్రమాల్లో డీపీఎం వేణుగోపాల్, ఏపీఎం బ్రహ్మయ్య, సీసీలు లావణ్య, సురేందర్, వీవోఏలు, వీవో లీడర్లు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ప్రత్యేక అధికారి
జన్నారం: జన్నారం మండలం మొర్రిగూడ గ్రామంలో మంచిర్యాల జిల్లా స్పెషల్ అధికారి కృష్ణ ఆదిత్య, అదనపు కలెక్టర్ మోతిలాల్, డీఆర్డీవో కిషన్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ధాన్యాన్ని పరిశీలించారు. తేమశాతం అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, డీఎం వేణు, ఐకేపీ ఏపీఎం బుచ్చయ్య ఉన్నారు.

క్లుప్తంగా

యూఎన్ సదస్సులో ఆర్జీయూకేటీ విద్యార్థిని


లహరి

నిర్మల్: బాసర ఆర్జీయూకేటీ నాలుగోసంవత్సరం ఈసీఈ చదువుతున్న విద్యార్థిని లహరికి అరుదైన అవకాశం లభించింది. యునైటెడ్ నేషన్స్‌లో ఇంటర్‌పోల్ కౌన్సిల్‌గా దేశం నుంచి ప్రాతినిధ్యం వహించింది. వర్సిటీ ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ లహరిని మంగళవారం అభినందించారు. మిగతా విద్యార్థులకు లహరి స్ఫూర్తి అని ప్రశంసించారు. ప్రతీ ఏడాది ఐక్యరాజ్యసమితి నిర్వహించే అంతర్జాతీయ ఆసియా యువత సదస్సు ఈసారి థాయ్‌లాండ్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో దాదాపు 36 దేశాల నుంచి 700 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఇందులో దేశం నుంచి పాల్గొన్న లహరి సమావేశంలో ప్రసంగిస్తూ సాంస్కృతిక మార్పిడి ప్రాముఖ్యతను, ప్రపంచ విధానాలను రూపొందించడంలో యువత పాత్ర, సమర్థవంతమైన కమ్యూనికేషన్ ప్రభావాన్ని వివరించింది. ఈమేరకు లహరిని విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు అభినందించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల అబ్జర్వర్‌గా ఇమ్రాన్


ఇమ్రాన్

ఖానాపూర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 8 వరకు వరంగల్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యోగా పోటీల అబ్జర్వర్‌గా మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్ పీడీ ఇమ్రాన్ నియామకమయ్యారు. ఈ మేరకు ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాంరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు పాఠశాల హెచ్ఎం నరేందర్‌రావు తెలిపారు.

108లో ఉద్యోగ అవకాశాలు

మంచిర్యాలటౌన్: ఈఎంఆర్ఐ 108 అంబులెన్సు వాహనాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా 108 వాహనాల ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 7న మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలోని 108 కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టులకు ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ, జీఎన్ఎం, ఏఎన్ఎం, బీఎస్సీ బీజెడ్‌సీ, బీఎస్సీ నర్సింగ్ చేసి, 30 ఏళ్లలోపువారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ సెట్‌తో ఇంట ర్వ్యూకు రావాలని సూచించారు. వివరాల కు 9849237102 నంబరులో సంప్రదించాలని సూచించారు.

రౌడీషీటర్‌పై పీడీ యాక్ట్

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులను బెదిరించడం, హత్యయత్నానికి పాల్పడుతున్న పెద్దపల్లి జిల్లా మంథని మండలం గుంజమడుగుకు చెందిన రౌడీషీటర్ కుంట శ్రీనివాస్‌పై మంగళవారం పీడీయాక్ట్ నమోదు చేసినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. హైకోర్టు న్యాయవాదులు వామన్‌రావు దంపతుల హత్య కేసులో కుంట శ్రీనివాస్ ప్రధాన నిందితుడిగా ఉన్నాడని పేర్కొన్నారు. సీపీ శ్రీనివాస్ ఆదేశాలతో శ్రీనివాస్‌పై పీడీ యాక్టు నమోదు చేశామన్నారు. నేరస్తుడిని చర్లపల్లి జైలుకు తరలించి పీడీ యాక్ట్ ఉత్తర్వులు అందించినట్లు తెలిపారు

స్కూటీ దగ్ధం

సోన్: మండలంలోని పాక్‌పట్ల గ్రామంలో సోమవారం రాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో స్కూటీ దగ్ధమైంది. బోడ కృష్ణమూర్తికి చెందిన స్కూటీ గతేడాది స్కూటీని రూ.90 వేలకు కొనుగోలు చేశాడు. ప్రతీరోజు లాగా స్కూటీకి చార్జింగ్ పెట్టి నిద్రపోయాడు. రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో స్కూటీ, బ్యాటరీ కాలిపోయింది.

గిరిజన క్రీడోత్సవం

- ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యేలు
- పోటీల్లో పాల్గొన్న 1600 మంది క్రీడాకారులు


జెండా ఊపి పరుగుపందెం పోటీని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్‌లోని కేబీ ప్రాంగణంలో మూడురోజులపాటు నిర్వహించనున్న 5వ రాష్ట్రస్థాయి గిరిజన క్రీడోత్సవాలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎంపీ గోడం నగేశ్, ఖానాపూర్, బోథ్ ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, అనిల్ జాదవ్, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాలు క్రీడాజ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఐటీడీఏ పరిధిలోని 1600 మంది ఆశ్రమ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. అంతకు ముందు వారిని పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేశ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో ముందుండాలన్నారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఏడాదికి రూ.320 కోట్లు వెచ్చిస్తున్నారని తెలిపారు. ఇండోర్ స్టేడియం, కబడ్డీ పరికరాల కోసం ఇదివరకే ప్రతిపాదనలు పంపించినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ ఉట్నూర్‌లో రెండోసారి గిరిజన క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గిరిజన విద్యార్థులు ఇప్పటి వరకు జాతీయ స్థాయిలో 47 పతకాలు సాధించారన్నారు. అతిథులను ఐటీడీఏ అధికారులు సన్మానించారు. అంతకుముందు విద్యార్థులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయి, హైదరాబాద్ ట్రైబల్ వెల్ఫేర్ డీడీ చందన, జిల్లా క్రీడల అధికారి పార్థసారథి, భుక్యా రమేశ్, పీడీలు తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీ, ఎమ్మెల్యేలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు

800 పరుగు పందెం పోటీలను ప్రముఖులు ప్రారంభించారు. రన్నింగ్‌లో బాలురు విభాగం నుంచి ఉట్నూర్ జోన్‌కు చెందిన పరుశురాం గోల్డ్ మెడల్, ద్వితీయ స్థానంలో మహేశ్, ఏటూరునాగారానికి చెందిన సతీశ్ తృతీయ స్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో భద్రాచలం నుంచి లిఖిత గోల్డ్ మెడల్, ద్వితీయ, తృతీయస్థానాల్లో చిన్నుబాయి, ప్రసన్న నిలిచారు. వీరికి ప్రముఖులు మెడల్స్ అందించి సర్టిఫికెట్లు అందజేశారు.

వైద్య విద్యార్థినికి ఆర్థికసాయం

సాక్షి స్పందన

నెన్నెల: జిల్లాలోని కన్నెపల్లి మండలం రెబ్బెనకు చెందిన మానేపల్లి పెంటయ్య–లక్ష్మి దంపతుల కుమార్తె శిరీష ఇటీవల నీట్‌లో జాతీయస్థాయి ర్యాంకు సాధించి భూపాలపల్లి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అడ్మిషన్ తీసుకుంది. నిరుపేద గిరిజన కుటుంబం కావడంతో బుక్స్, ల్యాబ్, మెటీరియల్, హాస్టల్ ఫీజు, ఇతర ఖర్చులకు ఎదురవుతున్న ఇక్కట్లపై 'చదువుల తల్లిని ఆదుకోండి' శీర్షికన ఈనెల 3న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి దాతలు స్పందించారు. మంగళవారం వరకు వైద్య విద్యార్థినికి రూ.70 వేల ఆర్థిక సాయం అందింది. సాక్షి కథనాన్ని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోశయ్య ఎస్సై రామారావు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన యూఎస్‌ఏలో తన మిత్రులు దుర్గం రాజ్‌కుమార్, లోకేశ్‌తో మాట్లాడారు. వారు పంపించిన రూ.25 వేల నగదును కుమురంభీం జిల్లా ఎస్పీ డీ.వీ.శ్రీనివాస్‌రావుతో విద్యార్థినికి అందజేశారు. ఎస్పీని అభినందించారు. మరో రూ.40 వేలు ఫోన్ పే ద్వారా దాతల నుంచి అందాయి. కోవిడ్ వలంటరీస్ వాట్సాప్ గ్రూప్ వ్యవస్థాపకుడు భీంపుత్ర శ్రీనివాస్ సేకరించిన రూ.5 వేలను విద్యార్థినికి అందజేశారు. పేదరికం చదువుకు అడ్డుకాదని విద్యలో ప్రతిభకనబరిస్తే ఉన్నత స్థాయిలో రాణిస్తారని ఎస్పీ అన్నారు. శిరీషను స్ఫూర్తిగా తీసుకుని గిరిజన, ఆదివాసీ విద్యార్థులు తమ చదువులు సాగించాలని సూచించారు. తల్లిదండ్రులు ఈ సందర్భంగా 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.


రూ.25 వేల నగదు అందిస్తున్న కుమురంభీం జిల్లా ఎస్పీ డీ.వీ.శ్రీనివాస్‌రావు

రెండు బైక్‌లు ఢీ, యువకుడి మృతి


మహేశ్ మృతదేహం

దండేపల్లి: మండలంలోని మేదరిపేట సమీపంలో మంగళవారం రాత్రి ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. లక్సెట్టిపేట మండలం హన్మంతుపల్లెకు చెందిన బోనాల మహేశ్ (30) బైక్‌పై దండేపల్లి మండలం గుడిరేవులోని అత్తగారింటికి వెళ్లి వస్తున్నాడు. మార్గమధ్యలో ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బైక్ కొన్న రోజునే ప్రమాదం

మహేశ్ కొత్తగా బైక్ కొనుగోలు చేసి అత్తగారింటికి వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన ప్రమాదంలో మృతి చెందడం కుటుంబీకులకు తీవ్ర విషాదం నింపింది. బంధువులు బోరున విలపించారు.

వాగులో మునిగి వృద్ధురాలి మృతి

లోకేశ్వరం: కాలకృత్యాలు తీర్చుకుందుకే వెళ్లిన వృద్ధురాలు ప్రమాదవశాత్తు వాగులో నీట మునిగి మృతిచెందింది. ఎస్సై అశోక్ కథనం ప్రకారం.. మండలంలోని మన్మద్ గ్రామానికి చెందిన అష్టం సత్యవ్వ(69), కోడలు భూమవ్వ కలసి సోమవారం తన చేనులో పత్తి తీయడానికి వెళ్లారు. సత్యవ్వ కాలకృత్యాలు తీర్చుకునేందుకు సుద్దవాగు వద్దకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు ఆమె ఆచూకీ కోసం వెతికిన దొరకలేదు. మంగళవారం ఉదయం సుద్దవాగులో శవమై తేలింది. కుమారుడు చిన్నారెడ్డి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రాజెక్టులో పడి వ్యక్తి..

భీమిని: ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి పీపీరావు ప్రాజెక్టులో పడి మృతిచెందాడు. ఎస్సై గంగారాం కథనం ప్రకారం..కన్నెపల్లి మండలం నాయకునిపేట పంచాయతీ బొగుడగూడెనికి చెందిన బోర్ల ధర్మయ్య (51) మతిస్థిమితం లేకపోవడంతో బంధువుల ఇంటికి వెళ్తూ వస్తుండేవాడు. గత అక్టోబర్ 12న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. మంగళవారం పీపీరావు ప్రా జెక్టు కట్టపై కాపరులకు దుస్తులు, చెప్పులు కనిపించాయి. పోలీసులు అక్కడికి చేరుకుని ఈతగాళ్లతో మృతదేహాన్ని బయటకు తీయించారు. కుమారుడు సుధాకర్ ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ..

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అనుకుంట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దాసరి అనిత (40) మృతిచెందింది. ఎస్సై ముజాహిద్ కథనం ప్రకారం.. బంగారుగూడకు చెందిన అనిత మంగళవారం ఆటోలో ఆదిలాబాద్‌కు వస్తున్నారు. ఆటోలో సైడ్‌కు కూర్చుని ప్రయాణిస్తుండగా బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. కుటుంబీకుల ఫిర్యాదుతో బైక్ నడుపుతున్న అమర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైలు కింద పడి కార్మికుడి ఆత్మహత్య


మొగిలి(ఫైల్)

రామకృష్ణాపూర్: స్థానిక రవీంద్రఖని రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం గుర్తుతెలియని రైలు కిందపడి మందమర్రి 3వ జోన్‌కు చెందిన సింగరేణి కార్మికుడు గురిజాల మొగిలి (59) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ జస్పాల్‌సింగ్ కథనం ప్రకారం.. కేకే ఓసీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే మొగిలి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు.

వాగులో దూకి యువకుడు..

నర్సాపూర్(జి): మద్యం మత్తులో యువకుడు వాగులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై హన్మాండ్లు కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా రాంనగర్‌కు చెందిన దోడర్నే దినేష్ (22) గత శనివారం భార్యతో కలిసి నర్సాపూర్(జి)మండలం బూర్గుపల్లి (కె) గ్రామంలో మేనమామ జాదవ్ మాధవ్ రావు ఇంటికి వచ్చారు. సోమవారం సాయంత్రం బైక్‌పై వెళ్తున్నానని చెప్పి బయల్దేరాడు. రాత్రివరకు ఇంటికి రాకపోవడంతో స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం అర్లి (కె) శివారు సుద్దవాగు బ్రిడ్జి వద్ద బైక్ నిలిపి ఉంది. గజఈతగాళ్లతో వాగులో గాలించగా మృతదేహం లభించింది. మద్యం మత్తులో వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి బావ సూర్యవంశీ సిద్ధాంత్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా స్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


దినేష్ (ఫైల్)

ప్రాణం తీసిన అతి వేగం

- కుచులాపూర్ సమీపంలో అదుపుతప్పి వాహనం బోల్తా
- ప్రమాదంలో ఒకరు మృతి
- ఇద్దరితోపాటు డ్రైవర్‌కు గాయాలు


బోల్తాపడిన బొలెరో వాహనం

తలమడుగు: అతివేగం ఒకరి ప్రాణం తీసింది. డ్రైవర్ అజాగ్రత్తగా వాహనం నడపడం కారణంగా ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని కుచులాపూర్ సమీపంలో వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై అంజమ్మ కథనం ప్రకారం..ఆదిలాబాద్‌లోని క్రాంతినగర్‌కు చెందిన కావాలె సచిన్ (39) సెంట్రింగ్ వర్క్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇద్దరు కూలీలు గోపాల్, నాందేవ్‌తో కలిసి సెంట్రింగ్ పని కోసం మహారాష్ట్రలోని కిన్వాట్ గ్రామానికి వెళ్లారు. అక్కడి నుంచి బొలెరో వాహనంలో సెంట్రింగ్ ఐరన్ ప్లేట్లను లోడ్ చేసుకుని మంగళవారం ఆదిలాబాద్‌కు వస్తున్నారు. డ్రైవర్ రేహన్ అతివేగంగా నడపడంతో కుచులాపూర్ సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో సచిన్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ఇద్దరు కూలీలు గోపాల్, నాందేవ్‌తోపాటు డ్రైవర్ రేహన్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను రిమ్స్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


సచిన్ మృతదేహం

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- పోలీసుల అదుపులో ముగ్గురు
- వివరాలు వెల్లడించిన సీఐ ప్రమోద్‌రావు

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలో అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్‌కు చెందిన ఫెరోజ్ ఆలీ, సయ్యద్ ఫరూఖ్, మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నయగావ్ గ్రామానికి చెందిన గంగాధర్ విఠల్ గైక్వాడ్‌లు ఏర్పడ్డారు. లక్సెట్టిపేట, మంచిర్యాల, రామకృష్ణాపూర్, నస్పూర్, మందమర్రి, ఆదిలాబాద్ జిల్లాలోని మావల, జగిత్యాల జిల్లాలోని ధర్మపురి ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డారు. జిల్లాకేంద్రంలోని ఐబీ చౌరస్తాలో పోలీసులు మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా ఉన్న ముగ్గురిని అదుపులో తీసుకుని విచారించగా చోరీలు చేసినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి మూడు బైక్‌లు, 24 గ్రాముల బంగారం, రాగి చెంబులు, ప్లేట్లు, గ్లాసులు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, వారిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సై ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


అంతర్రాష్ట్ర దొంగలతో పోలీసులు

అట్టహాసంగా సింగరేణిస్థాయి ఫుట్‌బాల్ పోటీలు


పోటీలు ప్రారంభిస్తున్న ఏరియా జీఎం దేవేందర్

మందమర్రిరూరల్: సింగరేణి సంస్థ మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియాలోని హైస్కూల్ మైదానంలో కంపెనీస్థాయి ఫుట్‌బాల్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ ప్రారంభించారు. ఉదయం ఎల్లందు, మణుగూరు ఏరియా జట్టుతో ఆర్జీ–3, భూపాలపల్లి జట్లు తలపడగా, ఆర్జీ–3, భూపాలపల్లి జట్టు రెండు గోల్స్ చేసి ఎల్లందు, మణుగూరు జట్టుపై విజయం సాధించింది. మందమర్రి, బెల్లంపల్లి ఏరియా జట్టుతో శ్రీరాంపూర్ జట్టు తలపడగా శ్రీరాంపూర్ జట్టు రెండు గోల్స్ వేసి గెలిచింది. సాయంత్రం ఆర్జీ–3, భూపాలపల్లి జట్టుతో ఆర్జీ–1, ఆర్జీ–2 ఏరియా జట్టు తలపడగా ఆర్జీ–3, భూపాలపల్లి జట్టుపై ఆర్జీ–1, ఆర్జీ–2 ఏరియాల జట్టు రెండు గోల్స్ వేసి గెలిచింది. కొత్తగూడెం, శ్రీరాంపూర్ జట్టు తలపడగా శ్రీరాంపూర్ జట్టు ఒక గోల్ చేసి విజయం సాధించింది. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఏరియా పర్సనల్ ఆఫీసర్ శ్యాంసుందర్, ఏరియా స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శివకృష్ణ, గౌరవ కార్యదర్శి కార్తీక్, అన్ని ఏరియాల స్పోర్ట్స్ కోఆర్డినేటర్స్, సూపర్‌వైజర్స్, టీం మేనేజర్స్, అన్ని ఏరియాల క్రీడాకారులు, క్రీడాభిమానులు, గుర్తింపు ప్రాతినిధ్య కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు


పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ఆదిలాబాద్: ఎస్జీఎఫ్ అండర్–14, 17 బాలుర జోనల్‌స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు మంగళవారం ఉత్సాహంగా సాగాయి. జిల్లా కేంద్రంలోని రెజోనెన్స్ పాఠశాలలో నిర్వహించిన పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని క్రీడాకారులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కాంతారావు, పోటీల ఆర్గనైజర్ రాష్ట్రపాల్ మాట్లాడుతూ జోనల్‌స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 7 నుంచి 9వరకు యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రఘుపతి, పాఠశాల డైరెక్టర్ ప్రమోద్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో ఉమ్మడి జిల్లాకు తృతీయ స్థానం


ప్రశంసపత్రాలు అందుకున్న ఉమ్మడి జిల్లా జట్టు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మహబూబ్‌నగర్ జిల్లాలో ఈనెల 3, 4, 5వ తేదీల్లో నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్ అండర్–17 రాష్ట్రస్థాయి బాలికల కబడ్డీ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తృతీయ స్థానం సాధించింది. మూడో స్థానం కోసం నల్గొండ, ఆదిలాబాద్ జిల్లా జట్లు హోరాహోరీగా తలపడగా 10 పాయింట్ల తేడాతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు తృతీయ స్థానం సాధించింది. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ట్రోఫీ, పతకాలు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. రాష్ట్రస్థాయిలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టును తృతీయ స్థానంలో నిలిపిన క్రీడాకారులు, కోచ్ రవీందర్‌ను మంచిర్యాల డీఈవో యాదయ్య, జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి రాజ్‌వీర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఒలింపిక్స్ అసోసియేషన్ కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఫణిరాజా, కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రాంచందర్ అభినందించారు.

అండర్-14 ఖోఖో బాలికల పోటీల్లో విజేత


విజేతగా నిలిచిన ఉమ్మడి జిల్లా జట్టు

లక్ష్మణచాంద: కామారెడ్డి జిల్లా మండలం పోసానిపేటలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన రాష్ట్రస్థాయి అండర్–14 బాలికల ఖోఖో పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్‌లో రంగారెడ్డి జిల్లా జట్టుపై 18–10 తేడాతో విజయం సాధించింది. ఇందులో పాల్గొన్న 17 మంది జట్టులో లక్ష్మణచాంద మండలం మునిపెల్లి నుంచి సంగెం నవీన, మండల కేంద్రానికి చెందిన బి.కీర్తన ఉన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం

ఆదిలాబాద్: జిల్లాకేంద్రంలోని మహాలక్ష్మివాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్జీఎఫ్ జోనల్‌స్థాయి అండర్–14 హ్యాండ్‌బాల్ పోటీలు మంగళవారం జరిగాయి. ఈ పోటీలను జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం అధ్యక్షుడు సాయిని రవికుమార్ ప్రారంభించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చినవారు ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు హుస్నాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు వివరించారు. హెచ్ఎం నరేందర్, రవీందర్, శిక్షకులు పాల్గొన్నారు.

జోనల్‌స్థాయి చదరంగం పోటీలు

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని బురుదగూడెంలో లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్ జోనల్ స్థాయి చదరంగం పోటీలు జరిగాయి. ఎస్జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఫణిరాజ్, చదరంగం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సిరాజ్ ఉర్ రహమాన్ ఈ పోటీలను ప్రారంభించారు. సుమారు 80 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీల్లో ఎంపికైనవారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. సభ్యులు ఈగ కనుకయ్య పాల్గొన్నారు.

అనుబంధానికి ప్రతిరూపం

- భావుబీజ్ ఉత్సవాలు ప్రారంభం
- కార్తీకపౌర్ణమి వరకు కొనసాగింపు
- అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్ల ప్రేమకు ప్రతీక


మంగళహారతి ఇస్తున్న అక్కాచెల్లెళ్లు

కెరమెరి(ఆసిఫాబాద్): అన్నదమ్ములు, అక్కా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే భావుబీజ్ ఉత్సవాలను సోమవారం నుంచి ఉమ్మడి జిల్లాలో ప్రారంభమయ్యాయి. మహారాష్ట్రకు అనుకుని ఉన్న ఆదిలాబాద్, కుమురం భీం, నిర్మల్ జిల్లాల్లోని మండలాల్లోనే దీన్ని నిర్వహించడం ఆనవాయితీ. దీపావళి తర్వాత మూడోరోజు నుంచి కార్తీకపౌర్ణమి వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయి.

భావుబీజ్ అంటే..!

యమధర్మరాజు తన చెల్లె యమున ఇంటికి వెళ్లి నూతన వస్త్రాలను అందించి ఆభరణాలు ఇచ్చారని పురాణకథలు చెబుతున్నాయి. మరెన్నో కథలు ఇలా ఉన్నాయి. యమధర్మరాజు మృతి చెందాక యమున కళ్లలోంచి కన్నీరు ఆగలేదు. ఆరోజు ముగిసిందని చూపించడానికి దేవుడు రాత్రిని సృష్టించాడు. దీంతో యమునకు సోదరుడిపై ఉన్న దుఃఖం తగ్గింది. అప్పటి నుంచి భావుబీజ్ నిర్వహిస్తారని అంటారు. యమున నదిలో మంగళవారం సోదరులు, సోదరీమణులు స్నానాలు ఆచరించడం పవిత్రంగా భావిస్తారు. కొన్ని ప్రాంతాల్లో చిత్రగుప్తన్ని ఆలయంలో పూజలు చేస్తారు. సోదరుల ఇళ్లకు సోదరీమణులు వెళ్లి మంగళహారతులు ఇస్తారు. వారి ప్రేమకు ప్రతిరూపంగా నిలిచే రోజును భావుబీజ్ అంటారు. సోదరులకు టెంకాయ, మొల్దారం, తమలాపాకులు, పోకలను సమర్పిస్తారు. తలకు రుమాలు చుడుతారు. మిఠాయిలు తినిపిస్తారు. మంగళహారతులు ఇస్తారు. కాళ్లు కడిగి ఆశీర్వదం తీసుకుంటారు. సోదరులు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటారు. అన్నదమ్ములు లేని అక్కాచెల్లెళ్లు చంద్రున్ని అన్న తమ్ముడిగా భావిస్తారు.

ప్రేమకు గుర్తుగా..

అన్నదమ్ముల ప్రేమకు గుర్తుగా ఏటా దీపావళి తర్వాత మూడో రోజు భావుబీజ్ పండుగను జరుపుకుంటాం. సోదరులు ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతున్ని ప్రార్థిస్తాం. తాత ముత్తల నుంచి ఇది నిర్వహిస్తున్నాం. సోదరులకు మంగళహారతులు ఇచ్చి ఆశీర్వాదం తీసుకుంటాం. – చోళే మీరా, గృహిణి, కెరమెరి

సెపక్‌తక్రా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి

రెబ్బెన(ఆసిఫాబాద్): హైదరాబాద్‌లో సెపక్‌తక్రా రాష్ట్ర ఎన్నికలు నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గోలేటికి చెందిన ఆర్.శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి డీఎల్ నర్సింహారావు తెలిపారు. 2028 వరకు ఈయన బాధ్యతలు నిర్వర్తించనున్నారు. జిల్లా ఒలింపిక్ అసోషియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణరెడ్డి, అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సెపక్‌తక్రా జి ల్లా ఉపాధ్యక్షుడు ఎస్.తిరుపతి ఆయన్ను అభినందించారు.